క్లుప్తంగా

ఎంపీని సన్మానించిన గడ్డం నాగరాజు



ఎంపీని శాలువాతో సన్మానిస్తున్న నాగరాజు

మానకొండూర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకమైన సందర్భంగా సంజయ్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాన్నాకుల శ్రీనివాస్, ప్రదీప్‌యాదవ్ ఉన్నారు.

పండ్లు, దుప్పట్లు పంపిణీ



పండ్లు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న సంజీవరెడ్డి

ఇల్లందకుంట: భవిష్యత్‌లో వృద్ధాశ్రమం లేని సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ న్యాయవాది కనుకుల సంజీవరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీరామసాయి వృద్ధాశ్రమంలో మల్లన్నపల్లి గ్రామానికి చెందిన సంజీవరెడ్డి పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వృద్ధాశ్రమంలో చేరడానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కనిపెంచిన తల్లిదండ్రులను కాదని కొందరు ఇంట్లో నుంచి పంపించారని, మరికొందరు ఉద్యోగ రీత్యా వేరే దేశాల్లో ఉంటూ తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో చేర్పించడం బాధాకరమన్నారు. వృద్ధులు శేషజీవితం బంధువులతో గడపాలని ఉంటుందని, వృద్ధాశ్రమానికి మిత్రులతో కలిసి మరింత సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, న్యాయవాదులు కుమార్, రవీందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



సరుకులందిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామానికి చెందిన తిప్పారపు పద్మ అనే నిరుపేద మహిళ నోటి క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఆదివారం ఆమె కుటుంబానికి ఆపద్బాంధవులు ఫౌండేషన్ ప్రతినిధులు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు దత్తు, చింతల శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రాజమౌళిలు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

రామడుగు: రామడుగు ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎస్సై తోట తిరుపతిని ఆదివారం బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు మల్లేశం, ప్రశాంత్, కల్లపల్లి అనిల్, మిరియాల విశాంత్, బండారి చరణ్ పలువురు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్

చొప్పదండి: మండలంలోని రాగంపేటలో ఆదివారం ఆర్యవైశ్య సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 600 మందికి డాక్టర్లు సముద్రాల రాజు, పల్లవి, జనరల్ ఫిజీషియన్ కార్తీక్, కృష్ణ కుంకుమల్ల, ఆయుర్వేద వైద్యులు కె. అమర్‌నాథ్, పి.లక్ష్మిశిరీష, వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ లత, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు మనోహర్, సుదర్శన్, మహేశ్‌కుమార్, సుధాకర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

గంగాధర: మండలంలోని కొండన్నపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సామాల వెంకటయ్య ఆదివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి మొదటి సర్పంచ్‌గా పనిచేశారని, వెంకటయ్య మృతి పట్ల సర్పంచ్ రేండ్ల జమునశ్రీనివాస్, మాజీ సర్పంచు రేండ్ల రాజిరెడ్డి, ఎంపీటీసీ మడుపు లింగారెడ్డి సంతాపం తెలిపారు.



జమ్మికుంట: నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావు



శంకరపట్నం: చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విశ్వబ్రాహ్మణులు



హుజూరాబాద్: నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



చిగురుమామిడి: జయశంకర్ జయంతిలో నాయకులు



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న ఏఎంసీ చైర్మన్ చుక్కారెడ్డి

జయశంకర్‌సార్‌కు నివాళి

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదివారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్‌సార్ జయంతి నిర్వహించారు. జయశంకర్ చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధనలో జయశంకర్‌సార్ చేసిన కృషిని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు అనుగుణంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన కొనసాగుతోందని తెలిపారు. పట్టణంలోని గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జయశంకర్ సార్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, మున్సిపల్ అధికారులు, వార్డ్ కౌన్సిలర్లు, పెన్షనర్స్ సంఘం జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, తిరునాగారి రమేశ్, గంగిశెట్టి జగదీశ్వర్, తాళ్లపల్లి అమరేందర్, కొరిక్యాల ముకుందం, మౌనూరి ప్రవీణ్, ఎం.జ్యోతి, బి.రాజు, పసుల స్వామి, కుమారస్వామి, విద్యాసాగర్, సాయన్న పాల్గొన్నారు.

జమ్మికుంట: మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జయశంకర్‌సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళి అర్పించారు. తెలంగాణ తొలిదశ ఉద్యమానికి ఊపిరి, మలిదశ ఉద్యమానికి మార్గదర్శి, తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, మేనేజర్ భూపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చొప్పదండి: తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్ జయంతిని మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నంలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విశ్వబ్రాహ్మణులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు సదానందం, ఊకంటి మదు, ప్రసాద్, రవీందర్,సుమన్,రాజు, వెంకటేశ్వర్లు, ఏఎస్సై మల్లారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని గాంధీచౌరస్తాలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జయశంకర్‌సార్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు బెజ్జంకి లక్ష్మణ్, శ్రీమూర్తి రమేశ్, సంఘం అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్‌కుమార్, ప్రధానకార్యదర్శి గొల్లపల్లి సదాచారి, కోశాధికారి గుగ్గిల్ల వేణుమాధవ్, ఉపాధ్యక్షుడు బాలకృష్ణచారి, బ్రహ్మచారి, సదాచారి, వెంకటాచారి, రవీంద్రాచారి, బ్రహ్మానందంచారి పాల్గొన్నారు. సుందరగిరి గ్రామ పంచాయతీ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి నిర్వహించారు.

రాస్తారోకో, దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



కేశవపట్నంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



దిష్టిబొమ్మ దహనం అడ్డుకుంటున్న పోలీసులు

గన్నేరువరం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం దహనం చేశారు. వడ్డే ఆనందరెడ్డి కుటుంబానికి ఎల్‌వోసీతో పాటు వ్యక్తిగతంగా సహాయం అందించానని ఎమ్మెల్యే అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడారని పేర్కొంటూ కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శిఅనిల్, పార్టీ మండల కోఆర్డినేటర్ రవీందర్, అనిల్, శ్రీకాంత్, మహంకాళి మల్లికార్జున్, ముడికే అజయ్, రాపోలు నవీన్, మంగారపు అనిల్, పాకాల పర్శరాములు, పెనకాల ప్రశాంత్, ముకేరా అభిలాశ్, మంగారపు శ్రీమాన్ పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేశారు. దేవాలయం లాంటి అసెంబ్లీలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అబద్దాలు మాట్లాడారని, మానకొండూర్ నియోజకవర్గంలో ఆరు గురుకులాలు ఏర్పాటు చేశామన్న ఎమ్మెల్యే ఎక్కడ ఏర్పాటు చేశారు? విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఇల్లంతకుంట మండలం సోమారంపేట సర్పంచ్ ఆనందరెడ్డి రూ.5లక్షల ఎల్‌వోసీ అందించినా ప్రాణం దక్కలేదని అసెంబ్లీ వేదికగా మాట్లాడారని, అసలు సాయం చేయలేదని ఆనందరెడ్డి కుటుంబం మీడియాలో మాట్లాడారని గుర్తు చేశారు. నయాపైసా సాయం చేయకున్నా అసెంబ్లీలో సాయం చేసినట్లు మాట్లాడిన ఎమ్మెల్యే ఆ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కరీంనగర్–వరంగల్ రహదారిపై రాస్తారోకోతో వాహనాలు నిలిచిపోయాయి. ఏఎస్సైలు వెంకటేశ్వర్‌రెడ్డి, సుధాకర్, మల్లారెడ్డి, సిబ్బంది రాస్తారోకోను విరమింపచేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బస్వయ్య, తిరుపతి, సత్యనారాయణరావు, ఇసామొద్దీన్, చందు, సదానందం,సంపత్ పాల్గొన్నారు.

మానకొండూర్: ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు మాట్లాడుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకూ మానకొండూర్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరగడంతో మానకొండూర్‌లో ఉద్రిక్తత నెలకొంది. అనంతరం నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నందగిరి రవీంద్రచారీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సంపత్‌గౌడ్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే అసెంబ్లీలో అసత్యం మాట్లాడటం ఆయనకే చెల్లిందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎంపీటీసీ సంపత్, అంజుత్‌రావు, దేవయ్య, శ్రీదర్, తిరుపతి, శంకర్, చారి, కానిగంటి మల్లికార్జున్, మర్రి ఓదెలు, బందెల మహేందర్, కోండ్ర సురేష్ పాల్గొన్నారు.

ఉప్పరమల్యాల గ్రామస్తుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

గంగాధర: మండలంలోని ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాన్ని గంగాధర మండలంలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆదివారం ఆందోళన నిర్వహించారు. మండలంలోని గర్శకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అందులో ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాన్ని నూతన మండలంలో కలపడానికి ప్రతిపాదించారు. నూతన మండల ఏర్పాటుపై ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అసెంబ్లీ సమావేశంలో సైతం ప్రస్తావించారు. రెండు రోజులుగా గ్రామస్తులు ఆందోళన బాటపట్టారు. ఉప్పరమల్యాల నుంచి నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడిన వెంకంపల్లి గ్రామస్తులు తమ గ్రామాన్ని గంగాధర మండలంలోనే కొనసాగించాలని శనివారం రాస్తారోకో చేశారు. రెవెన్యూ పరిధిలోని రెండు గ్రామాల ప్రజలు తమ గ్రామాన్ని గంగాధరలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై మధురానగర్ చౌరస్తాలో ఆదివారం రాస్తారోకో చేయగా పోలీసులు రాస్తారోకో విరమింపజేశారు.

‘వాగేశ్వరి’లో హరితహారం



తిమ్మాపూర్: మండలంలోని రామకృష్ణ కాలనీ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం హరితహారం నిర్వహించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని కళాశాల జనరల్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బ్యాంకు సిబ్బందితో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు కళాశాల మైదానంలో మొక్కలు నాటారు. కళాశాల డైరెక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ ర్యాలీ



చొప్పదండి: ర్యాలీ నిర్వహిస్తున్న చర్చి నిర్వాహకులు



జమ్మికుంటలో..

జమ్మికుంట: మణిపూర్ అల్లర్లను నిరసిస్తూ హుజూరాబాద్ నియోజకవర్గం మండల పాస్టర్ల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వరకు ఆదివారం సాయంత్రం శాంతి ర్యాలీ నిర్వహించారు. మణిపూర్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రజలకు భద్రత కల్పించాలని, దాడి చేసిన దుండగులను శిక్షించాలని, శాంతి నెలకొల్పే విధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హుజూరాబాద్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు జాషువా, ప్రధాన కార్యదర్శి నవీన్, పాస్టర్ల సంఘం మండల అధ్యక్షుడు సల్వారాజు, రవీందర్, ప్రభాకర్ క్రైస్తవులు పాల్గొన్నారు.

చొప్పదండి: మణిపూర్ అల్లర్లకు నిరసనగా పట్టణంలోని హోలీషాలోం చర్చి ఆధ్వర్యంలో ఆదివారం చర్చి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బిషప్ డాక్టర్ గుండేటి శాంతికుమార్ మాట్లాడుతూ... స్త్రీలపై దాడులు, ప్రార్థనా మందిరాలు కూల్చివేయడాన్ని ఖండించారు. చట్టబద్ధంగా నిందితులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఏలియా, ఆనంద్, అనీల్, శేఖర్, మనోజ్, జాన్, తదితరులు పాల్గొన్నారు.

గండిని పరిశీలించిన పాడి విజయానంద్‌రెడ్డి



కల్వల ప్రాజెక్టు గండిని పరిశీలిస్తున్న విజయానంద్‌రెడ్డి

శంకరపట్నం: భారీ వర్షాలకు గండిపడిన కల్వల ప్రాజెక్టును ఆదివారం యూప్ టీవీ సీఈవో పాడి విజయానంద్‌రెడ్డి పరిశీలించారు. వీణవంక మండలంలోని 15 గ్రామాలకు 70 ఏళ్లుగా ప్రాజెక్టు తాగు, సాగునీరు అందిస్తుందన్నారు. మరమ్మతులపై ఉన్నతాధికారులతో మాట్లాడి పనులు పూర్తి చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. సమావేశంలో రమేశ్, అబ్దుల్ , ఐలయ్యయాదవ్, సమ్మిరెడ్డి, నారాయణ, అమృత, ప్రభాకర్, శ్రీధర్, తదితరులు ఉన్నారు.

జలపాతం వద్ద పర్యాటకుల సందడి

వాహనాల పార్కింగ్‌కు స్థలం సరిపోక ఇక్కట్లు





సైదాపూర్: మండలంలోని రాయికల్ వాటర్‌ఫాల్స్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. స్నేహితుల దినోత్సవం, ఆదివారం కావడంతో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. దీంతో జలపాతం వద్ద వాహనాల పార్కింగ్‌కు స్థలం సరిపోలేదు. వాటర్ ఫ్లో తగ్గినా మోహిన్‌చెరువు, ప్రకృతి అందాలు, ఆహ్లాదాన్ని పర్యాటకులు ఆస్వాదించారు. రోడ్డు, రవాణా, తాగునీటి, వసతి గదుల వంటి సౌకర్యాలు కల్పించాలని పర్యాటకులు ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులను కోరారు.

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

శంకరపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని కేశవపట్నంలో ఆదివారం జీపీ కార్మికుల సమ్మెపై అఖిలపక్షం నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వేతనాల పెంపు, ఉద్యోగభద్రత, తదితర డిమాండ్లతో సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. జీపీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సీపీఎం కార్యదర్శి రాజిరెడ్డి, టీడీపీ అధ్యక్షుడు ఆరీఫ్, బీఎస్పీ నాయకుడు సంపత్, బీసీ సంఘం అధ్యక్షుడు అభిలాశ్, మాలమహానాడు నాయకుడు గరిగె ప్రభాకర్, సీనియర్ జర్నలిస్ట్ కొరిమి వెంకటస్వామి పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



గన్నేరువరం: చెక్కు, బియ్యం అందిస్తున్న స్నేహితులు

మానకొండూర్‌రూరల్: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మల్లం లక్ష్మీపతి మృతి చెందాడు. తోటి మిత్రులు 1985 పదో తరగతి విద్యార్థులు లక్ష్మీపతి కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. రూ.ఐదువేల నగదు, యాభై కిలోల బియ్యం అందించారు.

గన్నేరువరం: మండల కేంద్రం గన్నేరువరానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు జీల రాజు ఇటీవల మృతి చెందాడు. ఆయనతో చదువుకున్న పదో తరగతి విద్యార్థులు ఆదివారం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.యాభైవేల చెక్కు, యాభై కిలోల బియ్యం అందజేశారు.

పరామర్శ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో రావుల రమణారెడ్డిని, పోతిరెడ్డిపేట గ్రామానికి చెందిన చొల్లేటి రాధమ్మ కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి ఆదివారం పరామర్శించారు.

గీత కార్మికుడికి తీవ్ర గాయాలు

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన మోటపోతుల దేవేందర్‌గౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు పైనుంచి పడటంతో తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు తెలిపారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



హుజూరాబాద్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

సైదాపూర్: ప్రజా యుద్ధనౌక, గాయకుడు, చెమట చుక్కల్లోంచి పాటలు అల్లిన అలుపెరగని ప్రజా పోరాట యోధుడు గద్దర్ మృతి సబ్బండ వర్ణాలకు తీరని లోటని పలువురు, నాయకులు, గాయకులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో సీపీఐ జిల్లా నాయకుడు బత్తుల బాబు, మాజీ ఎంపీపీ పొడిశెట్టి వెంకటరాజం, కాంగ్రెస్ నాయకుడు గుండారపు శ్రీనివాస్, కేవైపీఎస్ మండల అధ్యక్షుడు వెంగళ రవి వేర్వేరుగా మాట్లాడారు. 2009లో సైదాపూర్ సాగునీటి ఎద్దడి, పలు సమస్యలపై సీపీఐ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో గద్దర్ తన ఆటపాటలతో సమస్యలపై గళమెత్తారని గుర్తు చేసుకున్నారు.

హుజూరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన ప్రజా గాయకుడు గద్దర్ అనారోగ్యంతో ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందగా, పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గద్దర్ చిత్రపటానికి ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. రాష్ట్ర సాధనకు పాటుపడిన తీరును గుర్తు చేసుకున్నారు.